క్లుప్తంగా

విద్యా సామగ్రి అందజేత



కొల్లాపూర్: పట్టణంలోని బుడగజంగాల కాలనీ ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు విద్యా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా నోట్‌పుస్తకాలు, పెన్నులు, పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ డివిజన్ అధ్యక్షుడు పతంజలి శంకర్‌గౌడ్, కార్యదర్శి కాశీపురం మహేష్, సభ్యులు సాయిశంకర్, సోమిశెట్టి రాంప్రసాద్, చెన్నరాయుడు తదితరులు ఉన్నారు.

ఆకస్మిక సందర్శన

లింగాల: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని శుక్రవారం ఎంపీడీఓ ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా పరిసరాలను, భోజనాన్ని సందర్శించారు. వంట గదిని శుభ్రంగా ఉంచాలని సూచించారు. వర్షాకాలంలో విద్యార్థినులు రోగాలబారిన పడకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, తరచుగా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఎస్‌ఓ శారదకు సూచించారు.

వెన్నచర్ల విద్యార్థికి జిల్లా స్థాయి అవార్డు

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో వెన్నచర్ల ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని శ్రావణి మొదటి బహుమతి అందుకున్నట్లు జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్‌రావు తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. గ్రామ విద్యాకమిటీ చైర్మన్ చిరంజీవి, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్‌లు బాలికను అభినందించారు.

డ్యాన్స్ మాస్టర్స్ జిల్లా కమిటీ ఏర్పాటు



నాగర్‌కర్నూల్‌రూరల్: డ్యాన్స్‌మాస్టర్స్ జిల్లా కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శేఖర్, నాగరాజు, విజయ్, సంయుక్త కార్యదర్శులుగా భరత్, కోశాధికారిగా రోజా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వెంకటేష్, ప్రచారం కార్యదర్శిగా యాదగిరిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ డ్యాన్స్ మాస్టర్ పోలోజి సత్యం, మురళీధర్, దేవేంద్రాచారి ఉన్నారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

లింగాల: వివిధ కారణాలతో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వ్యక్తులకు శుక్రవారం పోలీసులు అప్పగించినట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. మండలంలోని లింగాలకు చెందిన శివ, మండలంలోని అంబట్‌పల్లికి చెందిన శ్రీశైలం రెండు నెలల కిందట ఫోన్లు పోగొట్టుకొని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్లు గుర్తించి బాధితులకు అందించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

తాడూరు: మండల కేంద్రంలో ఎస్‌ఐ మహేష్ ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. బొలెరో వాహనంలో కారును తీసుకెళ్తుండగా వాహనాన్ని నిలిపి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నెట్ సౌకర్యం లేక ఇబ్బందులు



పెద్దకొత్తపల్లి: ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్‌నెట్ సౌకర్యం లేక దరఖాస్తుదారులు గంటలు తరబడి కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారు. రోడ్డు పనులు చేస్తుండగా నెట్‌కేబుల్ వైర్ తెగిపడటంతో నెట్ సౌకర్యానికి అంతరాయం ఏర్పడుతోంది. గ్రామాల్లో చేసుకున్న దరఖాస్తులలో 20 శాతం మందికి కూడ జీరో బిల్లు రాకపోవడంతో కార్యాలయానికి దరఖాస్తుదారులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.

తహసీల్దార్ బదిలీ

కొల్లాపూర్: పట్టణ తహసీల్దార్ శ్రీకాంత్ బదిలీ అయ్యారు. శుక్రవారం ఆయన రిలీవ్ అయి కలెక్టరేట్‌కు వెళ్లారు. డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న విష్ణువర్ధన్‌రావును ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో బాధ్యతలు చేపట్టారు.

దళిత కాలనీలపై ప్రత్యేక దృష్టి



ఇందిరానగర్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి టౌన్: దళిత కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని దళిత కాలనీ ఇందిరానగర్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. మున్సిపాలిటీలోని 22 వార్డులలో ఇందిరానగర్, బలరాంనగర్, హనుమాన్‌నగర్ కాలనీలో కొంత భాగంలో దళితులు అధికంగా నివసిస్తున్నారు. ఆయా కాలనీవాసులు దళితకాలనీలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయన కాలనీలలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలలో పర్యటిస్తూ పలు సమస్యలను ఆయన స్వయంగా గుర్తించారు. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉండటంతో కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పలు సమస్యలు వెలుగులోకి...

మున్సిపాలిటీలోని ఇందిరానగర్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యేకు అడుగడుగున సమస్యలు ఎదురయ్యాయి. మురుగుకాల్వలు పూర్తిగా దెబ్బతిని శిథిలావస్థకు చేరుకున్నాయని, తాగునీరు సకాలంలో రావడం లేదని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఇనుప విద్యుత్ స్తంభాలు మార్చాలని విన్నవించినా అధికారుల పట్టించుకోవడం లేదని వాపోయారు. పర్యటన అనంతరం అక్కడే సమావేశం ఏర్పాటు చేసి కాలనీవాసులతో ఎమ్మెల్యే మాట్లాడారు. 15 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దళిత కాలనీలకు ప్రత్యేకంగా ఉన్న ఫండ్స్ లేదా మున్సిపాలిటీలో ఉన్న ఫండ్స్‌ను కేటాయించి త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌ను ఆదేశించారు. కాలనీలలో ఇన్ని సమస్యలు ఉన్నా ఎందుకు తన దృష్టికి తీసుకురాలేదని కమిషనర్‌ను ప్రశ్నించారు.

నిధులు పక్కదారి..

మున్సిపాలిటీలలో దళిత కాలనీలలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం కేటాయించిన నిధులు ఇతర కాలనీలలో అభివృద్ధి పనులు చేస్తున్నారని కౌన్సిలర్లు పేర్కొన్నారు. వివక్షతో నిధులు ఖర్చు చేయకుండా వాటిని వెనక్కి వెళ్లే వరకు అధికారులు కాలక్షేపం చేస్తున్నారని వాపోతున్నారు.

ఉపాధ్యాయుల బదిలీపై విద్యార్థుల కంటతడి



కల్వకుర్తి లింగసానిపల్లిలో ఉపాధ్యాయుల ఎదుట విలపిస్తున్న విద్యార్థులు

కల్వకుర్తిరూరల్: మండలంలోని లింగసానిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న చంద్రశేఖర్, మహేశ్వరం, వెంకటేశ్‌లు ఇటీవల బదిలీ అయ్యారు. శుక్రవారం గ్రామస్తులు పాఠశాలకు చేరుకొని విద్యార్థులతో కలిసి వారికి ఘన వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులపై పూల చల్లుతూ గ్రామంలో ఊరేగించారు. ఎన్నో సంవత్సరాలు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు బదిలీ కావడంతో విద్యార్థులు బోరున విలపించారు. గ్రామస్తులు భావోద్వేగానికి గురయ్యారు. హెచ్‌ఎం నెహ్రూప్రసాద్, పీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, గుండూరు కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణమని ఎంఈఓ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని రాచూర్, గొల్లోనిపల్లి పాఠశాలల్లో బదిలీ అయిన ఉపాధ్యాయులకు వీడ్కోలు పలికారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రుడు, ఉపాధ్యాయులు రాజశేఖర్, వెంకట్‌రెడ్డి, రవికుమార్‌గౌడ్, విష్ణువర్ధన్, రవి, పావని, ఉదయ్‌కుమార్, లక్ష్మీబాయి, గోపాల్, భాస్కర్, గంగాధర్, హేమలత, నారాయణ, శ్రీనివాస్, జ్యోత్స్న, శ్రీలత, నాయకులు వెంకటేష్, తారాసింగ్ తదితరులు ఉన్నారు.

తాడూరు: మండలంలోని పాల్మూరులో బదిలీ అయిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌గౌడ్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో శైలజ, ప్రకాష్, అంగన్‌వాడీ టీచర్ మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అచ్చంపేటలో కుండలోని నిల్వ నీటిని పారబోస్తున్న మున్సిపల్ సిబ్బంది

అచ్చంపేట రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తగిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డులలో ఫ్రైడే- డ్రై డేను నిర్వహించారు. కాలనీ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పూల కుండీలు, కుండలు, టైర్లలో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. కార్యక్రమంలో కమిషనర్ శ్యాంసుందర్, కౌన్సిలర్లు, నాయకులు చంద్రమోహన్, వెంకటేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లాపూర్: మున్సిపాలిటీలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యానాగరాజు అన్నారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా పట్టణంలోని పలు వార్డుల్లో కౌన్సిలర్లు ఇంటింటికీ తిరిగి దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఇళ్లల్లో నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించారు. పలు ప్రాంతాల్లో ముళ్లపొదలను తొలగించారు. బండాయి గుట్ట వద్ద ఉన్న నీళ్లట్యాంకును, కాల్వ నిర్మాణం కోసం తవ్విన గుంతలను చైర్‌పర్సన్ పరిశీలించారు. దోమల నివారణ కోసం పట్టణంలో ఫాగింగ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్, కౌన్సిలర్లు రహీంపాషా, నయూమ్, బోరెల్లి కరుణమహేష్, కర్నె అలివేలవాసు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ధర్నా



కల్వకుర్తిరూరల్: పనిచేస్తున్న కూడా కూలి ఇవ్వడం లేదని ఉపాధి కూలీలు ధర్నా చేపట్టారు. మండలంలోని తర్నికల్ గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 2018వ సంవత్సరంలో 150 మంది కూలీలు ఓ కుంటకు సంబంధించిన పని చేశారు. దీనికి సంబంధించి ఇప్పటికీ కూలి డబ్బులు అందలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చేసిన డబ్బులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అనంతరం ఎంపీడీఓ వెంకటరాములుకు వినతిపత్రం అందజేశారు. అనసూయ, అలివేలు, సుభద్ర, లక్ష్మమ్మ, రాములమ్మ, గ్రామస్తులు సురేష్ పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈఓ



తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సామర్థ్యాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని బలాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

ముదిరాజ్ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బల్ల సత్తయ్య

నాగర్‌కర్నూల్: ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బల్ల సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నూకం వెంకటయ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జెడ్పీ మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 27 వరకు రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ అధికారుల ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రాలు పంపించేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ముదిరాజ్, ముత్త రాశి, తేనుగోళ్లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్, డీఎఫ్‌సీఎస్ చైర్మన్ వాకిటి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి సందు యాదగిరి, కార్యనిర్వాహణ కార్యదర్శి ఎర్రవోలు మహేష్, డైరెక్టర్స్ కేసారపు వెంకటయ్య, గొడుగు బాలచందర్, తిమ్మాజీపేట మండలం ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు కావలి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్లు

తెలకపల్లి: మండల కేంద్రంతోపాటు గౌరారం, రాకొండ, నడిగడ్డ, కార్వంగ, లక్నారం, చిన్నముద్దునూరు, నెల్లికుదురు తదితర గ్రామాల్లో పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్లను శుక్రవారం గ్రామస్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ

లింగాల: మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం వనమహోత్సవం అమలులో భాగంగా మండల కాంప్లెక్స్ సముదాయంలోని ఖాళీ ప్రదేశంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన మొక్కలను నాటారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలలో పెంచుతున్న మొక్కలను నాటేందుకు సిద్ధంగా ఉంచాలని ఎంపీడీఓ కోరారు. కార్యక్రమంలో ఏపీఎం ఇమాంఅలీ, పీఆర్ఏఈ శ్రీనివాసులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

తాడూరు: వన మహోత్సవానికి నర్సరీలలో మొక్కలు సిద్ధంగా ఉంచాలని ఏపీఓ చంద్రసిద్దార్థ కోరారు. శుక్రవారం మండలంలోని యాదిరెడ్డిపల్లి నర్సరీని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. నంతరం ఆయా గ్రామాల క్షేత్ర సహాయకులకు, నర్సరీ నిర్వాహకులకు అవగాహన కల్పించారు.

ఆదివాసీ చెంచులను ఆదుకోవాలి



కొల్లాపూర్ రూరల్: ఆదివాసీ చెంచులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి. ఈశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చెంచు గూడెంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెంచులు పూర్తిగా దుర్భర పరిస్థితులు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెంచులకు రేషన్, ఆధార్ కార్డులు లేక అవస్థలు పడుతున్నారున్నారు. కార్యక్రమంలో నాయకులు, సలీం, చెంచు నాయకులు నిమ్మల శివ, వెంకటయ్య, లింగస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన రాష్ట్ర నాయకుడు

కొల్లాపూర్: పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు అశోక్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ కమిషనర్ సర్వేశ్వర్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించారు. కొల్లాపూర్ పరిధిలోని పెద్దూటి ఆశ్రమపాఠశాల, మొలచింతలపల్లి ఆశ్రమ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు.

తాగునీటి సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే



ఊర్కొండ: మండలంలోని ఊర్కొంపేట ఎస్సీ కాలనీలో నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి శుక్రవారం గ్రామంలో బోరు డ్రిల్లింగ్ చేయించారు. పుష్కలంగా నీరు వచ్చింది. తాగునీటి సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యేకు ఎస్సీకాలనీ వాసులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరో రోజుకు చేరిన దీక్షలు



నాగర్‌కర్నూల్‌రూరల్: జీఓ నంబర్ 10 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో 24 రోజులు సమ్మె నిర్వహిస్తే అప్పుడున్న ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తామని టీచర్‌లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని మాట ఇచ్చి మాట నిలుపుకోలేదని గుర్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు పార్వతమ్మ, సువర్చల, అండాలమ్మ, పద్మమ్మ, కృష్ణమ్మ, వెంకటమ్మ, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

బల్మూర్: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన శుక్రవారం మండల కేంద్రంలోని శివారులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రేకుల పెద్ద ఉశన్న పాడి గేదె జంగిడిలో మేత కోసం వెళ్లగా నల్లచెరువు ఆయకట్టు ప్రాంతంలోని రఘుమారెడ్డి వ్యవసాయ బోరు వద్ద స్తంభానికి సపోర్టుగా ఉన్న వైరుకు తాకి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.80 వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

ముగ్గురు బాల కార్మికులకు విముక్తి

సాక్షి ఎఫెక్ట్..



చెంచు బాలురతో అధికారులు

మన్ననూర్: అమ్రాబాద్ మండలం బీకే లక్ష్మాపూర్‌లో ముగ్గురు బాలకార్మికులకు అధికారులు విముక్తి కల్పించారు. 'సాక్షి'లో గురువారం వెలువడిన 'బాలుడికి విముక్తి కల్పించండి' కథనానికి ప్రభుత్వ యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ రోహిత్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు శుక్రవారం బీకే లక్ష్మాపూర్ గ్రామాన్ని సందర్శించారు. మండ్లి బయ్యన్న అనే చెంచు బాలుడు తాక్రూ అనే వ్యక్తి వద్ద మూడేళ్లుగా మేకల కాపరిగా జీతం ఉన్నాడని అధికారులు నిర్ధారించారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం మూడు మేకలు తప్పిపోయాయని బాలుడిని తాక్రూ గొడ్డలి కర్రతో చితకబాదాడు. ఈ ఘటనను వెలుగులోకి తీసుకువచ్చిన 'సాక్షి' కథనం ఆధారంగా గ్రామానికి వెళ్లిన ఐటీడీఏ ఏఓ జాఫర్ ఉసేన్, ముస్కాన్ టీం సభ్యులతోపాటు అమ్రాబాద్ పోలీసులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. దీంతో మరో ఇద్దరు చెంచు బాలురు మండ్లి అంజి, అజయ్ సైతం అదే తండాలో మేకలు, గొర్రెల కాపరులుగా పనిచేస్తున్నట్లు గుర్తించి వారికి సైతం విముక్తి కల్పించారు. అక్కడి నుంచి ముగ్గురు చెంచు బాలురను అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి నాగర్‌కర్నూల్‌లోని చిల్డ్రన్ హోంకు తరలించామని ఏఓ జాఫర్ ఉసేన్ చెప్పారు. మైనర్ బాలుడు మండ్లి బయ్యన్నను మేకల కాపరిగా పెట్టి చాకిరి చేయించుకోవడంతో పాటు బాలుడిపై దాడి చేసిన సంఘటనలో తాక్రూపై కేసు నమోదు చేశామన్నారు. దాడులు చేసిన వారిలో డాక్టర్ ప్రవీణ్, ముస్కాన్ టీం ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, రాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సువర్ణ, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సభ్యులు సృజన, మౌనిక, మల్లేష్, జాకీర్, వెంకటేష్ ఉన్నారు.

జర్నలిస్ట్ కరుణాకర్‌కు ఘన నివాళి

నాగర్ కర్నూల్: జిల్లా కేంద్రానికి చెందిన జర్నలిస్టు మల్లెల కరుణాకర్ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ ప్రింట్, ఎలక్ట్రానిక్, ఫొటో, వీడియో జర్నలిస్టులు శుక్రవారం అంబేడ్కర్ కూడలిలో కరుణాకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

కరుణాకర్ మృతి బాధాకరం: జట్టి ధర్మరాజు

జర్నలిస్ట్ మల్లెల కరుణాకర్ మృతి బాధాకరమని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జట్టి ధర్మరాజు అన్నారు. శుక్రవారం మల్లెల కరుణాకర్ అంతిమయాత్రలో ఆయన పాల్గొన్నారు. నాగర్‌కర్నూల్ జర్నలిస్టులతోపాటు ఐజేయూ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మధుగౌడ్, జిల్లా నాయకులు కొండకింది మాధవరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు అబ్దుల్లా ఖాన్, కందికొండ మోహన్, జెమినీ సురేష్, సురేష్‌రావు, అహ్మద్, చంద్రశేఖర్ రావు, తదితరులు ఉన్నారు.

మానవత్వం చాటుకున్న నాయకులు

ఊర్కొండ: మండలపరిధిలోని రాచాలపల్లి గ్రామానికి చెందిన మాడ్గుల ఇదమయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఆర్థికసాయం చేసి మానవత్వం చాటుకున్నారు. తక్షణ సాయంగా రూ.42 వేలు మృతుడి కుమారుడు భిక్షపతికి అందజేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంప్యూటర్ బహూకరణ

ఊర్కొండ: మండలంలోని ఇప్పపహాడ్ లో ప్రాథమిక పాఠశాలకు నాగర్ కర్నూల్ జిల్లా అఖీ-ఖీ రోటరీ క్లబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం కంప్యూటర్లు విరాళంగా అందజేశారు. మాజీ సర్పంచ్ వనజ బాలస్వామి, బీజేపీ సోషల్ మీడియా కో కన్వీనర్ గిరి గౌడ్, వెంకట్ గౌడ్, సురేష్ చారి, రమేష్, యువకులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



కొల్లాపూర్: సిద్దిపేట కోర్టులో న్యాయవాదిపై ఏఎస్‌ఐ దాడికి పాల్పడడాన్ని నిరసిస్తూ పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నె శ్రీహరి ఏఎస్‌ఐపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీనివాసరావు, ఉపేందర్, వసంతరెడ్డి, నజీరోద్దీన్, భాస్కర్‌రెడ్డి, మధుసూధన్‌రావు ఉన్నారు.

టీజీఐఐసీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

కల్వకుర్తిరూరల్: రాష్ట్ర టీజీఐఐసీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నిర్మలజగ్గారెడ్డిని లయన్స్‌క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు కల్మిచర్ల రమేష్ శుక్రవారం సన్మానించారు. హైదరాబాద్‌లోని టీజీఐఐసీ కార్యాలయంలో చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పరిశ్రమల ఏర్పాటుకు సహాయసహకారాలు అందించాలని కోరారు. ఆయన వెంట క్లబ్ కోశాధికారి గోవింద్ శ్రీనివాస్ ఉన్నారు.

బోనాల పండుగపై పాటల చిత్రీకరణ

కొల్లాపూర్: పట్టణంలోని ఈదమ్మ గుడి వద్ద బోనాల పండుగకు సంబంధించిన పాటల షూటింగ్ నిర్వహించారు. అక్షయ్ రికార్డింగ్ స్టూడియో నిర్వాహకులు మీసాల రామన్న నేతృత్వంలో చిత్రీకరణ చేశారు. ఈదమ్మ బోనాల విశిష్టతను తెలియజేసేలా పాటల చిత్రీకరణ సాగుతున్నట్లు ఆయన వివరించారు. బోగ్యం రామచంద్రనాయుడు, సంధ్యారాణి, శ్రావణి, మంజుల, స్వాతి, గంగోత్రి తదితరులున్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ఊర్కొండ: మండల పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ నమోదైన వారికి శుక్రవారం శుక్రవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వీరబాబు మాట్లాడుతూ భవిష్యత్‌లో నేరాలకు పాల్పొడొద్దని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. సత్ప్రవర్తన కలిగి ఉంటే అధికారులతో చర్చించి రౌడీషీట్ క్లోజ్ చేస్తామని తెలిపారు.

వేతనాలు చెల్లించకుంటే నిరవధిక సమ్మె

పెంట్లవెల్లి: మండలంలోని గ్రామపంచాయతీ వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించకుంటే నిరవధిక సమ్మె చేస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కార్మికులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. 10 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను కార్మికులకు వెంటనే ఇవ్వాలని కోరారు. చిట్టెమ్మ, కృష్ణయ్య, రాము, లక్ష్మి, చందు, ఈశ్వర్, జ్యోతిలు పాల్గొన్నారు.

ధ్యానంతో రుగ్మతలు దూరం



మన్ననూర్: నిరంతరం ధ్యానం చేయడం ద్వారా రుగ్మతలు దూరం అవుతాయని మాస్టర్లు కల్వారాల నర్సింహ్మా, డాక్టర్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం మన్ననూర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయం ప్రాంగణంలో పీఎస్ఎస్ఎం ఆధ్వర్యంలో స్థానికులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాంసాహారంతో తీసుకోవడం ద్వారా అనారోగ్యంబారిన పడుతారన్నారు. శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. ధ్యానంతో బీపీ, షుగర్ వ్యాధులు దరిచేరవని వివరించారు. అనంతరం ధ్యాన గురువులను వెంకటరమణ సంబు శోభ దంపతులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు సంబు నరేష్, శేఖర్, సత్యనారాయణ, పద్మజ, మంజుల, జయమ్మ, ప్రభావతమ్మ, గోపాల్‌రెడ్డి, వెంకటయ్య, జగతయ్య, కృష్ణయ్య, పుల్లయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు ప్రారంభం

కల్వకుర్తి/చారకొండ: గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రయాణం సులభతరం చేసేందుకు ప్రజారవాణాను చేరువలో చేస్తున్నామని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి నుంచి అచ్చంపేటలోని మద్దిమడుగు, చారకొండలో పలు గ్రామాలను కలుపుతూ నూతన ఏర్పాటు చేసిన బస్సు సర్వీసులను ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారులతో కలిసి ప్రారంభించారు. రీజియన్ ఆర్‌ఎం శ్రీదేవి, డిప్యూటీ ఆర్‌ఎం లక్ష్మీధర్మ, మహబూబ్‌నగర్ డీఎం సుజాత, సీఐ శ్వేత, కౌన్సిలర్లు, నాయకులు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.